వక్రంగా ఆలోచించే అతన్ని ఆమె మనిషిగా ఎలా మార్చింది?

# మనిషి

అవధానుల సుధాకర్ రావు కథ

తనమీద జరుగుతోన్న మానభంగ ప్రయత్నంనుండి తప్పించుకునే దారిలేక, భయంతో గజగజా వణికిపోతోంది సరోజ. అతను ఆకలిగొన్న పులిలా కాంక్షతో మీదిమీదికొస్తుంటే, లేడిపిల్లలా భీతిల్లుతోంది. అతడి కళ్లు కోర్కెతో ఎరుపెక్కి, జరుగబోయే అనర్థానికి అద్దంపదుతున్నట్లున్నాయి.

ఆడది తన 'శీలం' కాపాడుకోవడానికి చివరిక్షణందాకా ప్రయత్నిస్తూనేవుంటుంది. సరోజకూడా అదేచేసింది. తన శాయశక్తులా అతడ్ని ప్రతిఘటించింది. పెనుగులాడింది.

కాని ఏం లాభం? నిస్సహాయంగా ఓడిపోబోతోంది. ఇవ్వాళ తన జీవితంలో అత్యంత దురదృష్టకరమైన రోజుగా నిల్చిపోబోతోంది. తన శరీరం ఓ పరపురుషుడి చేతుల్లో నలిగి, మలినపట్టం... అనే దుర్ఘటని ఏ దేవుడూ నిరోధించలేడేమో? కృష్ణపరమాత్మా! ఆనాడు చేతులెత్తి వేడుకోగానే నీ సోదరి ద్రౌపదిని ఆదుకున్నావు. ఈ రోజు నేనూ అలాంటి ఆపదలోనే వున్నాను. మరి, నన్ను రక్షించడానికి రావా తండ్రీ!

ఏ దేవుడూ తన మొర వినలేదు. అతను తనని సమీపిస్తున్నాడు. సరోజ బుగ్గలమీద కన్నీటి చారికలు లైటు వెలుగులో దీనంగా కన్పిస్తున్నాయి. తన ఏడుపు కూడా అతడ్ని కరిగించలేకపోయింది. అభ్యర్థనలూ, వేడికోళ్లా నిష్ఫలమయ్యాయి. ఆ తరుణంలో — 'శీల రక్షణ'కోసం ఆమె ప్రత్యామ్నాయ మార్గం గురించి తీవ్రంగా ఆలోచిస్తుండగా, అప్పుడు... ఆపద్బాంధవిలా, ఆశాదీపంలా ఊరట కలిగిస్తూ కనిపించింది పక్కనే టేబిల్‌మీద పళ్లబుట్ట పక్కనే తళతళ



మెరుస్తున్న పదునైన కత్తి.

అతను గమనించలేదు. ఆ కత్తినామె చేతుల్లోకి తీసుకోవడం. విజయగర్వం... ఆనందోత్సాహంతో ఊగిపోతున్నాడు. ఆడది అబల అనే తేలికభావం. పిట్ట వల్లో చిక్కింది. ఇంకెక్కడికీ పోదు. పైగా అది తన ఇల్లు. అందమైన బెడ్‌రూం. మనసుకి నచ్చిన ఆడది తన అధీనంలో వుంది. ఆ

నాలుగ్గోడల నడుమా ఆమెని తను తీరిగ్గా అనుభవించొచ్చు.

సరోజ ఒక్కో అడుగే వెనక్కె-నక్కు నడుస్తూ వచ్చి, చివరికి గోడ అడ్డు తగలడంతో అక్కడితో నిస్సహాయంగా నిలిచిపోవడమే చూశాడుగాని, అదనుకోసం చూస్తున్న ఆమె — తనని వధించడానికి అందుబాటులో వున్న ఓ ఆయుధాన్ని చేజిక్కించుకున్న సంగతి గమనించలేకపోయాడు.

ఇక ఏ అడ్డూ లేదని... చిరకాలంగా ఎదురుచూస్తున్న అవకాశం కలిసొచ్చిందనే సంబరంతో — ఆమెనందుకోబోతున్నందుకు... ఏ అవరోధం లేకుండా తన మనసు మెచ్చిన స్త్రీని పొందబోతున్నందుకు తనని తానే అభినందించుకున్నాడు.

ఇద్దరిమధ్యా మూడే అడుగుల దూరం వుంది. పక్కనే బెడ్. స్వర్గసుఖం రుచిచూడబోతున్నానని అనుకున్నాడు. పిచ్చివాడు. మృత్యువుని సమీపిస్తున్నానని తెలీక మృగరాజులా ధీమాగా నడుస్తూ ఆమె దగ్గరగా వచ్చాడు.

మూర్ఖుడు ఆమెకౌగిట్లో సుఖందొరుకుతుందనుకున్నాడుకాని, నేరుగా నరకానికి పంపుతుందని ఊహించలేకపోయాడు. ఆమె శరీరాన్ని చేతుల్తో చుట్టేశాడు. ఇక క్షణం ఆలస్యాన్నికూడా భరించే స్థితిలో లేడతను. ఒళ్లు తెలీని ఉన్మాదపు వివశత్వంలో అతనుంటే తన సర్వస్వం దోచుకోబోతున్నాడని కోపంతో రగిలిపోతూ — కసిగా... కచ్చతో.. అతనివెన్నులో ఒక్కపోటుపొడిచిందామె. కత్తి బలంగా దిగబడిందతని శరీరంలో.

ఎర్రని రక్తం చివ్వున ఎగజిమ్మి, ఆమె చేతులు తడిశాయి.

అతను కోపం, బాధ ముప్పిరిగొనగా "రాక్షసీ! నీ అంతు చూస్తాను" అంటూ మీదకు దాడిచేశాడు. ఈమారు ప్రాణరక్షణ కోసం సరోజ మరింత ధైర్యాన్ని కూడగట్టుకుని — ఇంకో రెండుసార్లు ఆ కత్తితో అతడ్ని పొడిచింది.

నిర్జీవంగా నేలకూలేడు.

అప్పుడు ఆమెకి దుఃఖం ముంచుకొచ్చింది. ఎంతైనా ఓ నిండు ప్రాణం. పాపభీతి, తదనంతర పరిణామాల్ని తల్చుకుని బావురుమని ఏడ్చింది.

"సరోజా... సరూ..." అంటూ నాలుగైదుసార్లు తట్టి పిలిచాడు ఆమె భర్త రామం.

సరోజ దిగ్గున లేచికూర్చుంది. ఆమెకి ఒక క్షణం ఏమీ అర్థంకాక, అయోమయంగా పిచ్చి చూపులు చూసింది.

"ఏమయింది రా, సరూ! ఎందుకలా కేకలు పెడుతూ ఏడుస్తున్నావు?" ప్రేమగా అడిగాడు.

"నేను 'హత్య' చేశానండీ. కోర్టు నాకు ఉరిశిక్ష వేస్తుంది. మీరు, పిల్లలు ఎలాగుంటారు...?" కన్నీళ్లతో భర్త గుండెల్లో తలదాచుకుని, బేలగా అడిగింది.

"నీ మొహం! నువ్వు హత్యచేయడమేంటి?" అని ధైర్యం చెబుతూ, గ్లాసెడు మంచినీళ్లు ఆమెచేత తాగించి, కుదుటపడేలా చేశాడు. కొంచెం సేపటి తర్వాత లాలనగా అడిగేడు —

"ఏరా సరూ! పీడకలొచ్చిందా?" అని.

అప్పటికి సరోజ తేరుకుని, యథాస్థితికొచ్చింది. రాత్రి పదకొండు గంటల సమయం అది... తను తమ ఇంట్లోనే సురక్షితంగా బెడ్‌రూంలో, భర్త, ముగ్గురు పిల్లల పక్కనే వుంటున్న సంగతి తెలుసుకుని, ఎంతో నిశ్చింతగా ఫీలయ్యింది.

"నీకేం భయంలేదు సరూ! నేనున్నాగా! హాయిగా నిద్రపో..." ప్రేమగా వెన్ను నిమురుతూ, అనురాగంతో కురులు సవరిస్తూ చెప్పాడు రామం. నిజమే. శ్రీరామచంద్రుడంటి భర్త తోడుండగా — దుస్వప్నాలకి, దుష్టరావణులకి తనెందుకు భయపడాలి? గువ్వలా భర్త కౌగిట్లో ఒదిగి, తనకొచ్చిన కలగురించి మొత్తం చెప్పింది.


"ఇందులో అంతగా భయపడాల్సిన పని లేదు సరోజా! మనుషుల్లో మంచి, చెడు ఉన్నట్లే కలల్లోనూ అందమైనవీ, పీడకలలూ వుంటాయి.

మీ 'బాస్' సంగతి నాకు పూర్తిగా తెలుసు! నిజమే. అతను మంచివాడుకాడు. అలాగని పూర్తిగా 'వెధవ' అనలేం. అతనికి నీమీద చాలా ఇష్టం, ఆరాధనాభావం వున్నాయి. నువ్వు కళ్లెదురుగా కనిపిస్తేనే పులకరించిపోతాడు. నువ్వంటే అతనికెంతో అపురూపం. బలవంతంగా నిన్ను సొంతం చేసుకునే పశుత్వం మాత్రం లేదతన్లో..." అంటూ వివరించి చెప్పాడు.

సరోజ భారంగా నిట్టూర్చింది. ఏది ఏమైనా, సర్దుకుపోవాలి. అతడి గుణగణాలతో పనిలేదు. అతనిదగ్గర ఉద్యోగం మావడానికి వీల్లేదు. తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి అందుకు అనుమతించదు.

తల్లి ఆరోగ్యంకోసం, చెల్లెళ్ల పెళ్లిళ్లు, తమ్ముడి చదువు వంటి కుటుంబ బాధ్యతలతో నలిగిపోతూ, అప్పుల్లో మునిగివున్నాడు తన భర్త. తన సంపాదన వేణ్నీళ్లకి చన్నీళ్ల తోడుగా అతనికి ఉపయోగపడుతోంది.

అలాంటిది, లేనిపోని పట్టుదలకి పోయి, ఉద్యోగం మానేస్తే నష్టపోయేది తను ఒక్కతేకాదు. యావత్ కుటుంబమంతా.



ఎంతకీ మళ్లీ నిద్రపట్టలేదామెకు.

దుష్టుడు... దుర్మార్గుడు... కసిగా తిట్టు కుంది తన 'బాస్'ని. పగలంతా ఆఫీసులో ఏడ్పించడమే కాక, ఇంట్లో రాత్రిపూట ఈ విధంగా కంటినిండా నిద్రకూడా పోనివ్వకుండా, భయంకరమైన కలల్తో మనశ్శాంతి లేకుండా చేస్తున్నాడు.

☆ ★ ☆

ఉదయం పదయింది. సరోజ అరగంట ముందుగానే ఆఫీసుకొచ్చింది.

'అటెండెన్స్ రిజిష్టర్'లో సంతకం చేయడంకోసం 'బాస్' గదిలోకి వెళ్లింది.

"హలో సరోజా! స్వాగతం. సుస్వాగతం' రివాల్వింగ్ కుర్చీలో విలాసంగా కూర్చున్న రాజారావు — ఆమెని చూడగానే వికసించిన మొహంతో, వెలిగే కళ్లతో చెప్పాడు.

మొదలయింది తనకి సంకటం... గొప్ప నరకం... అనుకుంది సరోజ ఇబ్బందిగా, అయిష్టంగా. అతని చూపులు నిలువెల్లా ఆమెని తడుముతున్నాయి.

"సరోజా! ఇవ్వాళ నువ్వు చాలా 'ఫెంటాస్టిగ్గా' కనిపిస్తున్నావు. నీ బర్త్‌డేనా? కాలేజీ అమ్మాయిలా — నీ అందం నన్ను కవ్విస్తోంది. ఈ వైట్‌శారీలో నీ బ్యూటీ... ఓహ్... ఎలా చెప్పను? ఎంత చూసినా తనివి తీరడంలేదు.

ప్రొద్దుట్నుంచీ సాయంత్రందాకా నువ్విక్కడే, నా కళ్లెదురుగా వుండిపోరాదూ?

సరూ! నువ్వు నా మనసు దోచావోయ్! అప్సరసలా... మోహనంగా, సమ్మోహనంగా... ఎంత ముద్దొస్తున్నవో..." పరవశంగా చెప్పుకుంటూ పోతున్నాడు.

"సార్! నేనొస్తాను. పెండింగ్ వర్క్ చాలా వుంది..." అతని ధోరణికి అడ్డుతగిలింది సరోజ.

"సరోజా! వర్క్ గురించి నువ్వేం బెంగపెట్టుకోకు. ఈ ఆఫీసు నాది. హోల్ అండ్ సోల్ ప్రొప్రైటర్ని. నువ్వు మహారాణిలా దర్జాగా కూర్చో. అసలు నేన్నీకోసం గంటనుంచి వెయిట్ చేస్తున్నాను. కూల్ డ్రింక్ తెప్పిస్తాను... కులాసాగా కబుర్లు చెప్పుకుందాం..." అన్నాడు.

"వొద్దుసార్! నాకలవాటు లేదు..."

"ఓకే! అలాగే. నీ ఇష్టమే నా ఇష్టం. నువ్వు కడగంటి చూపుతో నన్ను ఆజ్ఞాపించు సరూ! అన్నట్లు నువ్వు రాత్రి నా కల్లోకొచ్చావు సరోజా..."

"మీరూ వచ్చారు... నా కల్లోకి" నిశితంగా చూస్తూ చెప్పిందామె.

"ఓహో! అలాగా! నా అదృష్టం పండిందన్నమాట! సరూ! నువ్వు నా దగ్గర దేనికీ సంకోచించకు. నన్ను పరాయివాడిగా భావించకు. మనిద్దరి బంధం కేవలం యజమాని — ఉద్యోగస్తురాలిగా మాత్రమే వుండకూడదు. అన్నట్లు... ఈ నెలనుంచి నీ జీతం ఓ రెండొందలు పెంచుతున్నాను..."

"చాలా థాంక్స్ సర్!" అంది సరోజ ముక్తసరిగా. అంతలోకే స్టాఫ్ ఒకరొకరుగా వస్తూండడంతో సరోజకి అక్కడ్నుంచి బయటపడే ఛాన్స్ దొరికింది.

రాజారావుకి నలభై ఏళ్ల వయసుంటుంది. ఇటీవలనే భార్య క్యాన్సరొచ్చి కన్నుమూసింది. పిల్లాజెల్లా లేరు. ఒంటరితనంతో బతుకీడుస్తున్నాడు రాజారావు. మళ్లీ పెళ్లి

గురించి ఎంతోమంది వత్తిడి పెడుతున్నారు కాని, అతని మనసు సంసిద్ధంగా లేదు. మరోపక్క శరీరం స్త్రీ పొందుకోసం అలజడి పెడుతోంది. వయసు తోడుకావాలని ఆరాటం చేస్తోంది. అతను కావాలనుకుంటే ఆడవాళ్లకి కొరతా...? కాని, అతని మనసు సరోజమీద కేంద్రీకృతమైవుంది.

ఆమె వివాహితురాలు. ముగ్గురు పిల్లల తల్లి. కాని, తన మనసెందుకో ఆమెకేసి బలంగా ఆకర్షింపబడుతోంది.

అలా అన్చెప్పి, ఆమెపట్ల అసభ్యమైన కోర్కెలు కూడా లేవు. ఆమెతో చనువు, సాన్నిహిత్యం... కొద్దిపాటి రొమాన్స్... వీటినే కోరుతున్నాడు. సరోజ వైవాహిక జీవితాన్ని విచ్ఛిన్నం చేయాలనే ఆలోచన కూడా లేదు తనకి. కాని, ఆమెపట్ల ఎడతెగని ఇష్టం వుంది తనకి. ఓ నూనూగు మీసాల కుర్రాడు తనకిష్టమైన అమ్మాయిని హృదయంలో దాచుకున్నట్లు — తనుకూడా సరోజని తన అంతరంగంలో ప్రతిష్టించుకున్నాడు. 'దేవత'లా కొలుస్తున్నాడు.

ఓరోజు రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో సరోజకి ఆఫీసు వాచ్‌మెన్ ద్వారా కబురందింది.

రాజారావు క్లబ్బునుంచి కారులో ఇంటికొస్తుంటే టాంక్‌బండ్‌మీద లారీ ఏక్సిడెంటై, సీరియస్ కండిషన్‌లో నిమ్స్‌లో ఎడ్మిట్ అయ్యాట్ట. సరోజ మనసు మానవత్వంతో పొంగి పొరలింది. ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా — పిల్లల్ని పక్క పోర్షన్‌లో అప్పగించి, భర్తను తీసుకుని హుటాహుటిన హాస్పిటల్‌కి పరుగెత్తింది.

గాయాలు బలంగా తగలడంతో పరిస్థితి అంచనా వేయడానికే ఒకరోజు పడుతుందన్నారు. ఆలోపు రకరకాల టెస్టులు చేశారు. మర్నాడు చెప్పారు — అత్యవసరంగా ఆపరేషన్ చేయాని. జీర్ణకోశంలో ఓ రక్తనాళం దెబ్బతిన్నట్లు స్కానింగ్‌లో బయటపడింది.

దబ్బుకి లోటులేదు.

రెండు బాటిల్స్ బ్లడ్ కావాలన్నారు.

## బార్

"మీరిలా రాత్రి పన్నెండు గంటలదాకా బార్‌లో వుండి రావడం ఏం బావోలేదండీ" అన్నది భార్య మంగతాయి.

"మరి నేనేం చేసేదే. ఆ తర్వాత బార్ మూసేస్తున్నారు మరి" చెప్పాడు భర్త రాధాకృష్ణమూర్తి.

—శ్రీకొండ (ఎర్రబోడు)



ఆఫీసు స్టాఫ్‌లో ఎవరిదీ సరిపోలేదు. ఆఖరికి సరోజ బ్లడ్‌గ్రూప్ ఓకే అయింది.

"ఎంతకావాలో అంత రక్తం నాదగ్గర్నుంచి తీసుకోండి డాక్టర్..." మరో ఆలోచన లేకుండా ముందుకొచ్చింది సరోజ.

ఆపరేషన్ జరిగింది. రెండు వారాలకి పూర్తిగా కోలుకుని మామూలు మనిషి అయ్యాడు రాజారావు.

"డాక్టర్ మీరు నాకు పునర్జన్మనిచ్చారు. చాలా థాంక్స్" అన్నాడు రాజారావు డిశ్చార్జ్ రోజున.

"భలేవారే! ఇందులో మా క్రెడిట్ ముప్పై శాతం మాత్రమే. మిగతా సెవెంటీ పర్సెంట్ ఈ దంపతులకి దక్కుతుంది" చెప్పాడు డాక్టర్ సరోజని, ఆమెభర్త రామంని చూపుతూ.

ఇంజక్షనిస్తూ నర్సు వివరించి చెప్పింది. "నిజం సార్! ఈమె మీకు ఏమవుతుందో తెలీదుగాని — మీకోసం మాటలకందని త్యాగం చేసింది. ఈ మధ్యే తనకి 'సిజేరియన్' ఆపరేషన్ జరిగిందట. ప్రమాదమని మేం చెప్పినా వినిపించుకోకుండా మీకోసం తన రక్తాన్ని రెండు బాటిల్స్ ఇచ్చి, మీ ప్రాణాన్ని నిలబెట్టింది"

రాజారావు విచలితుడయ్యాడు.

"ఎందుకు చేశావుతల్లీ! ఇంతటి మహోన్నత త్యాగం?"

రామంకేసి కృతజ్ఞతగా చూశాడు రాజారావు. అతని ఔదార్యంమటుకు తక్కువదా? ఏమగాడైనా తన భార్యని మరో పురుషుడు కన్నెత్తి చూస్తేనే భరించలేడే! అలాంటిది తను సరోజపట్ల ఎంత అనుచితంగా ప్రవర్తించినా, అతను తనని క్షమించి, ఈ ఆపదలో ఆదుకున్నాడు. ఆపరేషన్ జరిగేక తనకెన్నో సేవలు చేశాడు. 'బాత్‌రూం'కి తీసుకెళ్లడం, బట్టలు మార్చడం... వగైరాలెన్నో, విసుగు, అసహ్యం లేకుండా తోడబుట్టినవాడికంటే మిన్నగా చేశాడు.

"అమ్మా సరోజా! నేను చాలా చెడ్డవాణ్ని. నిన్నెంతో కష్టపెట్టి నీ మనసు నొప్పించాను. కాని, మీరిద్దరూ కలిసి నన్ను మళ్లీ బ్రతికించారు. నేను చచ్చిపోవాలని లేదా మీకు?" అనడిగేడు.

సరోజ బదులుగా చెప్పింది — "లేకేం సార్! మీ మీద చాలా కోపంగా వుండేది. ఆ మాటకొస్తే, నా చేతుల్తోనే మిమ్మల్ని చంపినట్లు కలకూడా వచ్చింది నాకు.

అయితే మీరు ప్రాణాపాయ స్థితిలో వున్నప్పుడు సాటి 'మనిషి'గా స్పందించి, నేను చేయగలిగింది చేశాను. ఒక్క విషయం సార్! నేను ద్వేషించింది మీలో 'చెడు'ని మాత్రమే. చచ్చిపోవలసింది మనిషిలో వున్న వక్రపుటాలోచనలు మాత్రమే! చావుగాని, ప్రాణాలు తీయడంగాని ఏ సమస్యకీ పరిష్కారం కాదు. మనిషిలో వున్న చెడుని పెకిలించి వేయాలి. పెడదారి పట్టించే ఆలోచనల్ని చంపివేయాలి"

"మీరిద్దరూ నా కళ్లు తెరిపించారమ్మా! శారీరకంగానేకాదు నేను కోలుకుంటుంది — నా మనసుని మరమ్మతు చేసి, నన్ను 'మనిషి'ని చేసినందుకు మీ ఇద్దరికీ కృతజ్ఞతలు..." అంటూచేతులెత్తినమస్కరించాడు.

☆ ★ ☆